# అల్మట్టి వివాదం : నదీజలాల పంపకంలో ప్రజాతంత్ర విధానం న్యాయాన్యాయాల చర్చ

- కె. బాలగోపాల్

ఇది ఆల్మట్టి గురించి మాత్రమేకాదు. అల్మట్టి గురించి జరుగుతున్న ఆందోళన గురించి కూడా. కృష్ణా జలాల విషయంలో మన రాష్ట్రంలో ఆల్మట్టి సమస్యలాగా అందరి సమస్యలుగా, రాష్ట్ర సమస్యలుగా గుర్తింపు పొందకుండా చాలా కాలంగా జరుగుతున్న ఇతర ఆందోళనల గురించి కూడా. ఏ వివాదాన్నయినా అన్ని కోణాల నుంచి చూడడం అవసరం అనేది ఒక ప్రాథమిక ప్రజాతంత్ర నియమం. అల్మట్టి విషయంలో తెలుగువాళ్ళము దానిని మరిచిపోయినట్లున్నాము. కర్నాటక ఏమంటున్నదో తెలుసుకునే ప్రయత్నం మనం చేయడం లేదు. వాళ్ల వాదనను తెలుగు ప్రజలకు వినిపించే ప్రయత్నం పత్రికలుగానీ రాజకీయ పార్టీలుగానీ చేయడం లేదు. విషయాలు చెప్పకుండా విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం మాత్రమే జరుగుతున్నది. మన రాష్ట్ర ప్రభుత్వానికి - అల్మట్టి విషయంలో - కర్నాటక ప్రభుత్వంపైన రెండు ఫిర్యాదులున్నాయి. ఎగువ కృష్ణా ప్రాజెక్టు కింద బచావత్ అవార్డు కేవలం 5.8 లక్షల హెక్టార్ల సాగుకు అనుమతి ఇవ్వగా, కర్నాటక ప్రభుత్వం దానిని ఇప్పుడు 7.5 లక్షల హెక్టార్లకు పెంచుకుందని రాష్ట్రం అంటోంది. అసలు ఎగువ కృష్ణా ప్రాజెక్టుకు సంబంధించి బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన అనుమతిలో అల్మట్టి రిజర్వాయర్‌ను సాగునీటి కోసం ఉపయోగించుకోవడానికే వీలులేదు. సాగునీరు సరఫరా చేసేది నారాయణపూర్ రిజర్వాయర్. అల్మట్టి దానికి నీరందించే రిజర్వాయర్ మాత్రమే. అటువంటిది ఇప్పుడు కర్నాటక ప్రభుత్వం అల్మట్టి ఎడమ, కుడి కాలువలు తవ్వి సాగునీరు పొలాలకు అందివ్వాలనిచూస్తుంది.

అప్పర్ కృష్ణా ప్రాజెక్టు క్రింద కర్నాటక సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవడం దానంతటదే దిగువ ప్రాంతంవారికి నష్టకరంకాదు. తనకు కేటాయించిన నీటి వాటాకు పరిమితమై కర్నాటక ఏంచేసుకున్నా మనకు అభ్యంతరం ఉండనవసరం లేదు. అవార్డులో ముఖ్యమైన విషయం ఏ ప్రాజెక్టు క్రింద ఎంత సాగు విస్తీర్ణం ఆమోదించబడిందనేది కాదు. ఏ ప్రాజెక్టుకు ఎన్ని టిఎంసిల నీరు కేటాయించబడిందనేది కాదు. మొత్తంగా ఒక్కొక్క రాష్ట్రానికి ఎంత నీరు కేటాయించబడిందనేది ముఖ్యం. ఈ విషయం నిర్ణయించడానికి కావలసిన సమాచారం కర్నాటక బహిరంగపరచడంలేదని మనం విమర్శించడం సబబే. కానీ మన సంగతి? ప్రభుత్వ వ్యవహారాలు కనీసం పొరుగు ప్రభుత్వానికి కూడా తెలియకుండా రహస్యం పాటించడం భారత ప్రజాస్వామ్యానికి అంటుకున్న అవలక్షణాలలో ఒకటి. ప్రజలకు ఎట్లాగూ ఏదీ తెలపరు. మనం కట్టుకుంటున్న ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలన్నీ కర్నాటకకూ మహారాష్ట్రకూ మనం దాచిపెట్టకుండా తెలియజేస్తున్నామా?

బచావత్ అవార్డు వచ్చేనాటికి ఆంధ్రప్రదేశ్ కృష్ణా నదీ జలాలను అప్పటికే పెద్ద మొత్తంలో వాడుకుంటూ ఉంది కాబట్టి, అదనంగా ఆంధ్రప్రదేశ్‌కు 50 టిఎంసిల నీటిని మాత్రమే ఆ అవార్డు కేటాయించింది. కర్నాటక అప్పటికి వాడుకుంటున్నది తక్కువ కాబట్టి, కర్నాటకకు బచావత్ అవార్డు 195 టిఎంసిలు అదనంగా కేటాయించింది. దీనిని కర్నాటక ఇప్పటికింకా పూర్తిగా వినియోగించుకోలేదు. సగభాగానికి తగ్గ ప్రాజెక్టులు కూడా ఇప్పటికి నిర్మించుకోలేదు. 2000 సంవత్సరం లోపల తన వాటా వినియోగాన్ని పూర్తి చేసుకోవడానికి ఆ రాష్ట్రం ఆరాటపడడం సహజం. అందుకోసం వేగంగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం కూడా సహజమే. అప్పర్ కృష్ణా ప్రాజెక్టుకు కేటాయించిన 155 టిఎంసిల బదులు 173 వాడుకున్నా, 5.8 లక్షల ఎకరాల బదులు 71.5 లక్షల ఎకరాలు సాగుచేసుకున్నా, బచావత్ అవార్డుకు లోబడి కర్నాటక ఆ పనిచేసుకుంటే మనకు అభ్యంతరం ఉండనవసరంలేదు. నీటి కేటాయింపును అతిక్రమించకుండా ఆయకట్టులో మార్పులు చేసుకున్నా, ఒక ప్రాజెక్టు ఆయకట్టు పెంచి ఇంకొకటి తగ్గించుకున్నా ఆ స్వేచ్ఛ కర్నాటకకు ఎందుకు ఉండకూడదు? మన రాష్ట్ర హైకోర్టులో కర్నాటక చేసిన వాదన ఇదే. తమ వాటాకు వచ్చిన 700 టిఎంసిలను, రిటర్న్ ఫ్లో (లేక రీ జనరేటెడ్ ఫ్లో) 34 టిఎంసిలను మించి తాము వాడుకోబోవడంలేదని ఏ మార్పులు చేసుకున్నా అందులో భాగంగానే చేసుకుంటామనీ అంటున్నారు. నిజానికి, ఒక ప్రాజెక్టుకు కేటాయించిన నీటితో ఎంత విస్తీర్ణం సాగుచేసుకోవచ్చుననేది నీటి వాడకాన్ని బట్టి ఉంటుంది. ఇతర నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు జలాలను పరిమితంగా సరఫరా చేయవచ్చును. వరిసాగుకు కాక ఆరుతడి (ఇరిగేటెడ్ డ్రై) సాగుకు మాత్రమే ఇయ్యవచ్చును. ఈ రకంగా సాగు విస్తీర్ణం పెంచుకోవచ్చును. కర్నాటక ఏం చేయదలచుకుందో మనకు తెలియదుకానీ, అప్పర్ కృష్ణాకు బచావత్ కేటాయించిన 155 టిఎంసిలను, కర్నాటకకు అందుబాట్లో ఉన్న రిటర్న్ ఫ్లో 34 టిఎంసిలను కలుపుకొని ఆరుతడి సాగుకు పారించుకుంటే అప్పర్ కృష్ణా క్రింద 7.5 లక్షల హెక్టార్లు సాగుచేసుకోవచ్చు. 1 టిఎంసి (అంటే వందకోట్ల ఘనపుటడుగులు) 10 వేల ఎకరాల ఆరుతడి సాగుకు సరిపోతుందని అంచనా. అంటే 189 టిఎంసిలతో 118.9 లక్షల ఎకరాలు సాగు చేసుకోవచ్చును. హెక్టార్లలోకి మార్చుకుంటే ఇది 7.5 లక్షల హెక్టార్లవుతుంది.

కర్నాటక ఈ పనే చేయదలచుకుందో లేక పైకి ఒకటి చెప్పి లోపల తన వాటాను మించి కృష్ణా జలాలు వాడుకోదలచుకుందో మనకు తెలీదు. ఎందుకంటే 173 టిఎంసిలకు పెంచుకున్న అప్పర్ కృష్ణా ప్రాజెక్టును మాగాణి సాగుకు ఉపయోగించుకునే ఉద్దేశ్యం కర్నాటకకు ఉన్నట్టు ఆ రాష్ట్రం చేస్తున్న వాదనను బట్టి అనిపిస్తుంది. అప్పుడది 7.5 లక్షల హెక్టార్లకు సరిపోదు. మిగిలిన నీళ్ళు కర్నాటక వాటా నుండే వస్తాయా లేక ఆంధ్రప్రదేశ్ వాటా చోరీకి గురి అవుతుందా అని మనకు అనుమానం రావడంలో తప్పులేదు. కానీ దానికి నివృత్తి ఏమిటి? సాగునీటి గురించి రైతులలో సహజంగా ఉండే అభద్రతా భావాన్ని ఆసరా చేసుకొని రెచ్చ గొట్టడమా? ఇరుగు పొరుగు రాష్ట్రాలు ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ఆందోళనలు చేపట్టడమా? భారతదేశాన్ని ఒక ఫెడరల్ ప్రజాతంత్ర దేశంగా తీర్చిదిద్దడంలో తాము నిమగ్నమై ఉన్నామని ఈ రెండు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు చెప్పుకుంటున్నారు. దాని అర్థం ఏళ్లూవాళ్లూ కలిసి ఢిల్లీలో పదవులు పంచుకోవడం మాత్రమేనా? ఫెడరలిజం అంటే అధికార పదవుల పంపకం మాత్రమే కాదు. ఆర్థిక రాజకీయ వికేంద్రీకరణ ఇరుగు పొరుగుల మధ్య సామరస్య సంబంధాలు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి, వీటికి కావలసిన వ్యవస్థలు, వ్యవస్థిత ప్రజాతంత్ర సంప్రదాయాలు - ఇవన్నీ అభివృద్ధి చెందాలి. ఆల్మట్టి ఎత్తు ఎంత ఉందో చూసి వస్తామని బయలుదేరుతున్న పెద్ద మనుషులు పనిలో పనిగా బీజాపూర్ జిల్లా రైతాంగం పరిస్థితి ఏమిటో చూసి రావచ్చుకదా? అప్పర్ కృష్ణా ప్రాజెక్టు

ఆయకట్టులోని కరువు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చుకదా? దానిని కృష్ణా డెల్టాతో పోల్చిచూసుకోవచ్చు కదా? అప్పుడు కనీసం వాళ్ల సాగునీటి దాహం మనకు అర్థం అవుతుంది కదా?

'అనుమానం' మాటకొస్తే, కృష్ణా జలాల వాడకం విషయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవహార శైలి గురించి కర్నాటకకూ మహారాష్ట్రకు చాలా కాలంగా సహేతుకమైన అనుమానాలున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా నదిలోని నికర జలాలు 2,060 టిఎంసిలని అంచనా వేసి ఆంధ్రప్రదేశ్‌కు 800, కర్నాటకకు 700, మహారాష్ట్రకు 560 పంచింది. ఇవికాక రిటర్న్ ఫ్లో ఆంధ్రప్రదేశ్‌కు 11 టిఎంసిలు, కర్నాటకకు 34 టిఎంసిలు, మహారాష్ట్రకు 25 టిఎంసిలు దక్కుతాయి. ఈ జలాలమీద ఆయా రాష్ట్రాలకు 'హక్కు' ఉంటుంది. అంటే ఆ మేరకు ప్రాజక్టులు కట్టుకోవచ్చును. ఈ 2,060 టిఎంసిలను మించి ఏ సంవత్సరమైనా నదిలో ప్రవహించే నీటిని అదనపు జలాలు లేక మిగులు జలాలు (సర్‌ప్లస్ ఫ్లో) అంటారు. దీనిమీద కూడా మూడు రాష్ట్రాలకూ హక్కు ఇవ్వాలన్న కోరికను బచావత్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. మిగులు జలాలమీద ఎవ్వరికీ హక్కు ఉండదు గానీ దిగువ రాష్ట్రమయిన ఆంధ్రప్రదేశ్ వాటిని వాడుకోవచ్చునని ట్రిబ్యునల్ అనింది. అంటే అర్థం, మిగులు జలాలను ఆధారం చేసుకొని ప్రాజెక్టులు కట్టుకోవడానికి వీలులేదుగానీ వాటిని ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకోవచ్చును. అయితే మన రాష్ట్రం మిగులు జలాలను ఆధారం చేసుకొని ప్రాజక్టులు నిర్మించే ప్రయత్నం చూస్తేనే ఉంది. నిజానికి రాయలసీమ, దక్షిణ తెలంగాణా జిల్లాల దాహం తీర్చాలంటే మన రాష్ట్రంలో వున్న రాజకీయ పరిస్థితులలో ఇది అనివార్యం అయింది. బచావత్ అవార్డు వచ్చే నాటికే మన రాష్ట్రంలో కృష్ణా జలాల అసమాన వాడకం వ్యవస్థీకృతం అయిపోయింది. కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పెద్ద భాగాన్ని మింగేసాయి. బచావత్ నుండి మనకు అదనంగా వచ్చిన నికర జలాలు 50 టిఎంసిలు మాత్రమే. రాయలసీమ, దక్షిణ తెలంగాణాల సాగునీటి అవసరాలు తీర్చాలంటే ఈ అసమాన వాడకాన్ని సవరించి కోస్తా జిల్లాలు వాడుకుంటున్న కృష్ణా జలాలలో కొంత భాగాన్ని ఎగువన ఆపివేయాలి. లేదా మనకు హక్కులేని మిగులు జలాలను వాడుకోవాలి. మొదటిది రాజకీయంగా అసాధ్యం కావడంవల్ల రెండవది జరిగింది. తెలుగుగంగ ఈ పరంపరలో మొదటిది. తెలుగు గంగ ద్వారా పొందుతుంటున్న 29.8 టిఎంసిలలో 15 టిఎంసిలు మాత్రమే నికర జలాలు (అవి కూడా నికర జలాలు కావనీ, మిగులు జలాలేననీ ఒక వాదన ఉంది). మిగిలినవి మిగులు జలాలే. జూరాలకు కేటాయించిన నీటిలో కూడా కొంత భాగం మిగులు జలాలేనని కర్నాటక అనుమానం. ఈ మధ్య మన ముఖ్యమంత్రి పునాదిరాళ్లు వేసిన గాలేరు - నగరి, హంద్రీ - నీవా, వెలిగొండ ప్రాజెక్టుల విషయం కూడా ఇంతే. ఏ వాగులనూ వంకలనూ చూపించి ఆ ప్రాజెక్టులను రూపొందించుకున్నామో, వాటిలో ప్రతిపాదిత ఆయకట్టుకు కావలసిన నీళ్లు (మొత్తం 120 టిఎంసీలు) లేవు. శ్రీశైలం రిజర్వాయర్ నుండి కృష్ణా జలాలను తరలించి ఆ ప్రాజెక్టుల రిజర్వాయర్‌లను నింపుకుంటేనే అవి సాధ్యం అవుతాయి. కావలసిన మోతాదులో నికర జలాలు లేనప్పుడు తరలించే నీళ్లు మిగులు జలాలే కాగలవు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకునే తెలుగుగంగ కోసం ఉద్దేశించిన పోతిరెడ్డిపాడు తూము పరిమాణాన్ని పెంచమని రాయలసీమ ఉద్యమకారులు 1980లో ఆందోళన చేసి సాధించుకున్నారు. ఈ విషయాలన్నీ కర్నాటకకు, మహారాష్ట్రకు తెలియకుండా పోలేదు. 'ఆల్మట్టి కింద పెంచుకున్న సాగుకు నీరు నీళ్లెక్కడి నుండి వస్తాయని మన ప్రభుత్వం కర్నాటకను అడుగుతున్నది. దానికి జవాబుగా కర్నాటక కూడా హంద్రీ లేక గాలేరు వంటి ఒక నీళ్లులేని వాగును చూపించగలదు. అదేదో వాళ్లు మాత్రమే పాల్పడుతున్న దుర్మార్గం కాబోదు. ఈ రకమైన తెలివి తేటలు మనకు మాత్రమే ఉన్నాయనుకోకూడదు. ఇంక పులిచింతల గురించయితే కర్నాటక దాకా ఎందుకు, రాయలసీమవాసులకే అనుమానాలున్నాయి. కృష్ణా డెల్టా ఆధునీకరణద్వారా ఆదా అయ్యే నీటితో పులిచింతల నిర్మించుకుంటున్నామని మన పాలకులు అంటున్నారు గానీ, 'నికర జలాలను కబ్జా చేసుకున్నది చాలక మిగులు జలాలను కూడా కబ్జా చేసుకోవడానికి కృష్ణా జిల్లావాళ్లు చేస్తున్న ప్రయత్నమే ఇది' అన్న సహేతుకమైన సందేహం రాయలసీమలో నెలకొని ఉంది.

నికర జలాలు పోను మిగులు జలాలన్నీ దిగువ రాష్ట్రమే వాడుకోవాలన్న బచావత్ నిర్ణయంపట్ల మహారాష్ట్ర, కర్నాటకలలో అసంతృప్తి ఉండడంలో అన్యాయమేమీ లేదు. బచావత్ అవార్డు గడువు తీరిపోయిన తరువాత (అంటే క్రీ.శ. 2000 తరువాత) చేసుకోబోయే కొత్త ఒడంబడికలో మిగులు జలాలను వాడుకునే అవకాశం తాము కూడా పొందగలమని ఆ రెండు రాష్ట్రాలూ ఆశిస్తున్నాయి. అయితే ఆ లోపల ఆంధ్రప్రదేశ్ మిగులు జలాలపైన 'హక్కు' కల్పించే ప్రాజెక్టులు కట్టేసుకుంటే ఆ అవకాశం కోల్పోతామని వాళ్లు న్యాయంగానే ఆందోళన చెందుతున్నారు. ఈ రకమైన పరస్పర సందేహాలు అనుమానాలూ ఉన్నప్పుడు ఒకరిపైన ఒకరు ద్వేషం రెచ్చగొట్టడం పరిష్కార మార్గం కాదు. దేశాన్ని ఒక ఫెడరల్ ప్రజాతంత్రంగా తీర్చిదిద్దే పద్ధతి ఇది కాదు. నదీ జలాల వాడకం విషయంలో జరిగిన ఒప్పందాలకు అందరూ కట్టుబడి ఉండేటట్టు చూడడానికీ, 'అవసరం వచ్చినప్పుడు వాటిని సమీక్షించుకొని సవరించుకోవడానికి ఒక శాశ్వత ట్రిబ్యునల్‌ను నెలకొల్పవచ్చు. లేదా శాశ్వతమైన ఆర్బిట్రేషన్ వ్యవస్థనుగానీ రివర్ వ్యాలీ అథారిటీనిగానీ నెలకొల్పవచ్చు. ఇలాంటి వ్యవస్థలూ సంప్రదాయాలు తగినన్ని రూపొందించుకుంటేనే భారతదేశం ఒక ఫెడరల్ ప్రజాతంత్ర వ్యవస్థ కాగలుగుతుంది. తెలుగుదేశం, అస్సాం గణపరిషత్, జనతాదళ్, సమాజ్‌వాది పార్టీ, సిపిఐలు కలిసి ఢిల్లీలో పదవులు పంచుకోవడమే ఫెడరలిజం కాదు.

కావేరీ జలాల విషయంలో కన్నడులు - తమిళులు అంటూ ద్వేషాలు రెచ్చగొట్టడం వల్ల కర్నాటకలో జరిగిన హింసాకాండను మనం మరచిపోకూడదు. వేలాది తమిళ కుటుంబాలు ఆస్తులు కోల్పోయి కర్నాటక నుండి తమిళనాడుకు పారిపోవలసి వచ్చింది. మన రాజకీయ పార్టీలు, దిన పత్రికలు పని గట్టుకొని రెచ్చగొడుతున్న ప్రాంతీయ విద్వేషాలు ముదిరితే ఆ చరిత్ర పునరావృతం కాగలదు. ఆ రకమైన హింస ఎవరిమీద జరిగినా తప్పే. కనీసం ఆ నైతిక స్పృహ లేకపోయినా తెలుగువాళ్లకే ఎక్కువ నష్టం జరగగలదనే ఇంగితమైనా మనకు ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కన్నడులు చాలామందే ఉన్నారుగానీ వాళ్లు సమాజంలో ఆధిపత్యం చలాయించడం లేదు. కర్నాటకలో స్థానిక తెలుగువారు చాలామంది ఉన్నారు. ఎంఎల్ఏలు, మంత్రులు కూడా ఉన్నారు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ నుండి కర్నాటకకు వలసపోయి వ్యవసాయంలో, కాంట్రాక్టులలో పెద్ద స్థానం పొందినవాళ్లు చాలా మంది ఉన్నారు. కర్నాటక నీళ్లు - ఆంధ్ర నీళ్లు అంటూ నదీ జలాలను పంచుకునేటట్టయితే బళ్లారి జిల్లాలోని తుంగభద్ర డ్యాం క్రింద భూములు కొనుక్కున్న ఆంధ్రుల హక్కేమిటి? వాళ్లను కన్నడులు అక్కడి నుండి వెళ్లగొట్టవచ్చునా? బెంగుళూరు మహా నగరంగా ఎదిగిన క్రమంలో లాభం పొందిన ఆంధ్ర కాంట్రాక్టర్లు, పెట్టుబడిదార్లు అనేకులున్నారు. సర్కార్ జిల్లాలవాళ్లు, రాయలసీమవాళ్లు కూడా ఉన్నారు. 'మా అభివృద్ధి ఫలితం మీకెందుకు దక్కాలి?' అని వాళ్లను అక్కడి నుండి తరిమేయవచ్చునా?

'కృష్ణానది ఆంధ్రులకు కేవలం ఒక నదికాదు. అది మా వ్యక్తిత్వంలో అంతర్భాగం. మా సంస్కృతీ సంప్రదాయాలలో విడదీయరాని భాగం' అని

మన రాష్ట్ర పాలకులు కేంద్రానికి సమర్పించిన నివేదికలో అన్నారు. బాగుంది. కాని 'మహారాష్ట్ర కృష్ణానది పుట్టినిల్లు. దాని మాతృగడ్డ' అని మహారాష్ట్రులు అనలేరా? కర్నాటక కూడా ఇటువంటి కవిత్వం చెప్పజాలదా? మనకు మాత్రమే ఉన్నతమైన తాదాత్మ్య భావాలు ఉంటాయా? తక్కిన వాళ్లంతా నీటిని కేవలం నీరు అనుకునే పచ్చి భౌతికవాదులా?

సాగు విస్తీర్ణం పెంపుదల గురించేకాక, అల్మట్టిలో కర్నాటక హైడెల్ విద్యుదుత్పత్తి కోసం నిలువ ఉంచుకోబోతున్న నీటిని గురించి కూడా మనం ఆందోళన చెందుతున్నాం. బచావత్ అవార్డు ప్రకారం అల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల కెపాసిటీ మొత్తం 80 టిఎంసిలు. ఇప్పుడు పెరిగిన ఆయకట్టు కోసం, హైడెల్ టర్బైన్లు తిప్పుకోవడం కోసం దానిని కర్నాటక 251 టిఎంసిలకు పెంచుకుంటూ ఉంది. దీని గురించే మన నాయకులంతా విపరీతంగా ఆవేశపడుతున్నారు. అంత నీళ్ల ఎగువ ప్రాంతంలో నిలువ ఉంచుకునేటట్లయితే, దానిని సాగుకోసం ఉపయోగించుకోక పోయినా అది నిండేంతవరకు నది నీళ్లు కిందికి పోకపోయేటట్లయితే, దిగు ప్రాంతానికి నీళ్లు చాలా ఆలస్యంగా వస్తాయనీ వర్షాభావం వున్న సంవత్సరాలలో అసలే రాకపోవచ్చుననీ మనవాళ్లు చాలా ఆందోళన వ్యక్త చేస్తున్నారు. కృష్ణా డెల్టా ఎడారి అయిపోతుందని ఒకరు, దివిసీమలో బ్రహ్మజెముళ్లు మొలుస్తాయని ఇంకొకరు, శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లు ఇంకిపోయి రాష్ట్రం అంధకారంలో మునిగిపోతుందని మరొకరు, విపరీతమయిన అతిశయోక్తులు మాట్లాడుతున్నారు. ఇక్కడ కూడా వాస్తవాలెరిగి మాట్లాడుకోవడం అవసరం.

కర్నాటక ఆ నీటిని టర్బైన్లు తిప్పడం కోసం నిలవ ఉంచుకుంటూ ఉంది. అతి ఖర్చు కాదు. కొంత ఆవిరి అవుతుంది. కొంత వాడకంలో వృధా కావచ్చు. వృధా ఎంత అవుతుందనేది లెక్కగట్టి చెప్పలేము. ఆవిరి ఎంత అవుతుందనేది రిజర్వాయర్ ఉపరితల వైశాల్యాన్నిబట్టి ఉంటుంది. ఏమయినా ఆది నిలువ వుంచిన నీటిలో 10 శాతానికి ఇటూ అటూగా ఉంటుంది. ఆ మేరకు మాత్రమే దిగు నీటి ప్రవాహం ఆలస్యం అవుతుంది. (తొలి సంవత్సరం తప్ప), పైగా, ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహించే కృష్ణా జలాలన్నీ అల్మట్టిని దాటి వచ్చేవేకావు. దిగు ప్రాంతంలో కలిసే నీరు చాలా ఉంది.

కృష్ణానది నికర జలాలలో మన వాటా అయిన 800 టిఎంసిలలో 462 కర్నాటక నుండి వస్తాయని అంచనా. అయితే అందులో తుంగభద్ర, భీమ నదులు తెచ్చే నీరు కూడా ఉంది. ఆ నదులు కృష్ణలోకి అల్మట్టికి దిగున కలుస్తాయి. అవి తీసుకొచ్చే నీటికి అల్మట్టి రిజర్వాయర్ అడ్డురాదు. అల్మట్టి నుండి నేరుగా క్రిందికి పారే నీటిలో, ఆ రిజర్వాయర్ నుండి ప్రతి సంవత్సరం ఆవిరి అయ్యే (25 లేక 30 టిఎంసిల) నీటిమేరకు మాత్రమే మనకు నీరు ఆలస్యంగా రావడం, వర్షాభావ సంవత్సరాలలో లోటుపడడం జరుగుతుంది. కర్నాటక చెప్పేవన్నీ అబద్ధాలేననీ, ఆ 251 టిఎంసిల రిజర్వాయర్ కెపాసిటీ సహాయంతో వాళ్ల 400 టిఎంసిల నీరు పొలాలకు ప్రవహింపజేసుకోదలచుకున్నారని మనల్ని మనం ఉద్రేకపరచుకోదలచుకుంటే అది వేరే సంగతి.

వాళ్ల మాటలమీద కొంత విశ్వాసం ఉంచి (అనుమాన నివృత్తికి అనువయిన వ్యవస్థలు రూపొందించుకొని) ఆలోచించేటట్లయితే అంధకారాన్ని గురించి, కరువు కాటకాల గురించి ఆవేశపడవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. మన రాష్ట్రంలో జరిగే విద్యుదుత్పత్తిలో 33 శాతం మాత్రం శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో జరుగుతుంది. ఆ విద్యుత్కేంద్రాలు ఇప్పటికంటే కొంచెం ఎక్కువ కాలం పూర్తి సామర్థ్యం కంటే కొంచెం తక్కువ సామర్థ్యంతో పనిచేయవలసి వస్తే దానివల్ల మనకు కొంత ఇబ్బందే. కానీ రాష్ట్రం చీకటి కొట్టయిపోదు. కరువు మాటకొస్తే, కృష్ణాడెల్టా, నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలలో వర్షపాతం సమృద్ధిగానే ఉంది. భూగర్భ జలాలు సాపేక్షంగా బాగున్నాయి. 25 లేక 30 టిఎంసిల నీరు అల్మట్టిలో అదనంగా నిలిచిపోవడంవల్ల ఇక్కడ కరువు వస్తుందనడం హాస్యాస్పదం. నిజంగానే అందరూ భయపడుతున్నట్టు అంతకంటే ఎక్కువ నీరు నిలిచిపోయినా ఇక్కడ సాగునీటి వాడకపు పద్ధతులు, పంట విధానాలు కొంత మార్పిడి చేసుకోవలసి వస్తుందేమో. ఊరికే కేకలు వేయకుండా మనకు రాగల ఇబ్బంది ఎంతనేది వాస్తవికంగా అంచనావేసి అప్పర్ కృష్ణా ప్రాజక్టు సాగు చేయవలసిన ప్రాంతంలోని కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వారితో సహోదర భావంతో చర్చించడం సాధ్యంకాదా?

నీటి వాడకంలో న్యాయ న్యాయాల గురించి ఇంకొంచెం వివరంగా మాట్లాడుకుందాం. 'కర్నాటక చర్యలవల్ల మా ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. వాటిని మేము కాపాడుకుంటాం' అని మాత్రమే మనము అనడంలేదు. 'మాకు అన్యాయం జరుగుతున్నది. న్యాయం చేయండి' అని కూడా అంటున్నాం. ఇది మంచిదే. ప్రయోజనాలనే కాక నైతిక ప్రమాణాలను కూడా ప్రాతిపదిక చేసుకొని మాట్లాడినప్పుడే మనుషుల మధ్య సంభాషణ సాధ్యం అవుతుంది. వట్టి ప్రయోజనాలే ప్రాతిపదిక అయితే తిట్టుకోవడం మాత్రమే సాధ్యం అవుతుంది. అయితే న్యాయాన్యాయాల ప్రాతిపదిక తమ ప్రయోజనాల గురించి మాట్లాడే వాళ్లు ఇతరుల ప్రయోజనాల గురించి కూడా అదే ప్రాతిపదికన ఆలోచించడానికి సిద్ధపడాలి. కృష్ణా జలా విషయంలో కర్నాటక ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తున్నదని వాదించేవాళ్లు మన రాష్ట్రానికి వచ్చిన వాటాను మనం అసమానంగా పంచుకోవడంవ రాయలసీమ, దక్షిణ తెలంగాణా జిల్లాలకు జరిగిన అన్యాయాన్ని గురించి ఆలోచించడానికి సిద్ధంగా ఉండాలి. ప్రాదేశిక సానుకూలతన ఉపయోగించుకొని ఎగువ ప్రాంతంలో నీటిని బంధించి కూర్చోవడ అన్యాయం అనేవాళ్లు, రాజకీయ ఆధిపత్యాన్ని ఉపయోగించుకొని దిగ ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టేసి హక్కులు కల్పించుకొని కూర్చోవడం కూ అన్యాయమని గుర్తించాలి. అల్మట్టి వల్ల కృష్ణాడెల్టా ఎడారి అయిపోతుంద ఆందోళన చెందేవారు, మన రాష్ట్ర వాటాను అసమంగా పంచుకోవడం వ ఇప్పటికే సగం ఎడారి అయిపోయిన అనంతపురం గురించి కూడా ఆందోళ చెందాలి. కృష్ణాడెల్టా ఎడారి అయిపోతే అది కృష్ణాడెల్టావాసుల సమస మాత్రమే కాదని తెలుగువారందరి సమస్య అనీ వాదించేవార మహబూబ్‌నగర్ ఎండిపోయినా అనంతపురం వాడిపోయినా అ మహబూబ్‌నగర్ సమస్య మాత్రమేకాదనీ, అనంతపురం సమస్య మాత్ర కాదనీ తెలుగు వాళ్లందరికీ సమస్య అనీ గుర్తించాలి. న్యాయాన్యాయా గురించి మాట్లాడుతున్నారు కాబట్టి ఈ మాట అంటున్నాం. లేకపో అనవలసిన పనిలేదు.

అయితే నల్గొండ జిల్లావాళ్లు శ్రీశైలం ఎడమ కాలువ పనులు త్వర పూర్తిచేయాలని దానిలోని సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరించాల చాలా కాలంగా చేస్తున్న ఆందోళన వాళ్ల ఆందోళనే అయింది. అది మనం సమస్యకాలేదు. వాళ్లు చివరికి విసిగిపోయి పార్లమెంటు ఎన్నికల విపరీతంగా నామినేషన్లు వేసినప్పుడు మాత్రం అది మనందరికే కాదు, దేశా సమస్య అయింది. దానికోసం ఎన్నికల నామినేషన్ డిపాజిట్‌ను 10 రె పెంచారుగానీ శ్రీశైలం ఎడమ కాలువ సమస్యను పరిష్కరించలే పరిష్కరించమని తెలుగువాళ్లందరూ ఒక్కగొంతుతో (అల్మట్టి గురి చేస్తున్నట్టు) ఆందోళన చేయలేదు.

రాయలసీమకయితే సాగునీటి విషయంలో ఘోరమైన అన్యాయ జరిగింది. కోస్తా తెలంగాణా జిల్లాలకంటే రాయలసీమలో వర్షపాతం తక్కు

భూగర్భ జలాలు తక్కువ. ఉన్న చెరువులన్నీ నాశనం అయ్యాయి. సాగునీటి కోసం కృష్ణ, పెన్న నదులపైన రాయలసీమ వాసులు ఆశలు పెట్టుకున్నారు. అవిరెండూ వాళ్లకు దక్కకుండా పోయాయి. కృష్ణ-పెన్నలపైన పెద్ద ప్రాజెక్టు కట్టి రాయలసీమను కరువునుండి విముక్తి చేయాలని బ్రిటిష్‌వాళ్లు గత శతాబ్దం చివరిరోజులలోనే ప్రతిపాదించారు. కానీ దానికి కార్యరూపం ఇవ్వలేదు. 1951లో అప్పటి మద్రాస్ రాష్ట్రప్రభుత్వం ఈ ఆలోచనకు మళ్లీ ప్రాణంపోసి, రాయలసీమకు 100 టిఎంసిల సాగునీరు ఇస్తూ తమిళ జిల్లాలకు సాగునీరు ఇస్తూ తమిళ జిల్లాలకు సాగునీరు సరఫరా చేసే కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టును రూపొందించి ప్రణాళికా సంఘం ఆమోదం కూడా పొందింది. కానీ ఆతరువాత ఆంధ్రరాష్ట్రం ఏర్పిడినాక కృష్ణ నీళ్లు తమిళులకు ఇవ్వడానికి వీలులేదని మన పాలకులు గొడవచేసి ఆ ప్రాజెక్టును రద్దుచేసి నాగార్జునసాగర్ నిర్మించారు. తమిళులతోపాటు రాయలసీమవాసులు కూడా కృష్ణనీళ్లపైన హక్కును కోల్పోయారు. ఆ తరువాత పెన్నానది మీద సోమశిల ప్రాజెక్టు కట్టి నెల్లూరు జిల్లా అవసరాలకు పెద్దపీట వేయడవంవల్ల ఆ నదికూడా రాయలసీమకు దక్కకుండాపోయింది. రాయలసీమ పేరుమీద కట్టిన తెలుగుగంగ ప్రాజెక్టు నీళ్లుకూడా రాయలసీమకంటే నెల్లూరు జిల్లాకే ఎక్కువపోతాయి. వర్షపాతానికీ సాగునీటి లభ్యతకూ సంబంధించిన గణాంకాలు చూస్తే రాయలసీమ దుస్థితి కొంతయినా అర్థం అవుతంది.

| ప్రాంతం | నగటు వర్షపాతం (మి.మీ.) |
|---|---|
| కోస్తా | 1024 |
| తెలంగాణా | 929 |
| రాయలసీమ | 691 |

| | సాగుభూమిలో నీటిపారుదల వసతిగల శాతం (1992) |
|---|---|
| కోస్తా | 58 |
| తెలంగాణ | 33 |
| రాయలసీమ | 22 |

(తెలంగాణాలో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను వేరుచేసి చూపిస్తే అవికూడా రాయలసీమ వలెనే ఉంటాయి).

వివక్ష ఫలితమైన రాయలసీమ దుస్థితి గురించి రాయలసీమ ఉద్యమకారులూ మేధావులూ చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో జరిగిన అన్యాయాన్ని వివరణాత్మకంగా చెప్తున్నారు. కానీ వినేవాళ్లెవరూ లేరు. అది మనందరి సమస్య ఎప్పుడూ కాలేదు. కేవలం రాయలసీమ వాసుల సమస్య అయింది. రాయలసీమ ఎడారి అయిపోతున్నదని అందరూ ఏడవరు. రాయలసీమ వాసులు మాత్రమే ఏడవాలి. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ ప్రాజెక్టుల గురించి ఊరికే హామీలిచ్చి ప్రయోజనంలేదనీ, ఉద్దేంగా దొరికే పునాదిరాళ్లు వేసిపోతే ఉపయోగం లేదనీ, నికర జలాలో మిగులు జలాలో ఏదో ఒక జలాలు కేటాయించి పనులు మొదలుపెట్టి క్రీ.శ. 2000 లోపల పూర్తి చేయాలనీ ఇప్పుడు రాయలసీమవాసులు ఆందోళన చేస్తున్నారు. అది వాళ్ల గొడవే అయింది. అందరి గొడవా కాలేదు. కానీ కేటాయించని నీళ్లకోసం ఆల్మట్టి రభసలో కలిసిరమ్మని రాయలసీమ వాసులను మన పాలకులు ఆహ్వానించడానికి వెనుకాడడంలేదు!

బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ తన వాదన వినిపించినప్పుడు మాత్రం రాయలసీమనే ప్రధానంగా చూపించింది. తరతరాల కరువునుండి రాయలసీమకు విముక్తి లభించాలంటే కృష్ణా జలాలలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ వాటా కావాలని వాదించింది. అప్పటికే చాలాచాలా వాడుకుంటూ ఉండడంవల్ల అదనంగా ఎక్కువ నీరు ఆంధ్రప్రదేశ్‌కు దక్కలేదుగానీ మొత్తంమీద పెద్దవాటా మనకే దక్కింది. మిగులు జలాలను వినియోగించుకునే అవకాశం కూడా మనకే దక్కింది. కానీ రాయలసీమకు చేసింది శూన్యం. నిజానికి కోస్తా జిల్లాలు కృష్ణాజలాల పైన తాము స్థాపించుకున్న 'హక్కు'ను కొంత వదులుకొనిదే రాయలసీమకు చేయగలిగింది తక్కువే. ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన 800 టిఎంసిల నికర జలాలలో రాయలసీమకన్నా సర్కార్ జిల్లాలు మూడురెట్లు తీసుకుంటున్నాయి. మళ్లీ వర్షపాతం అక్కడే ఎక్కువ వుంది. భూగర్భజలాలు అక్కడే మెరుగ్గా వున్నాయి. ఇదంతా చాలక ఇప్పుడు గోదావరి నదిమీద పోలవరం డ్యాం కట్టి గోదావరి, కృష్ణనదుల మధ్య ప్రాంతంలో ఇప్పటికింకా నదీజలాలు అందని నేలలకు కూడా (భూగర్భజలాలు, చెరువునీరు సమృద్ధిగానే అందుతున్నప్పటికీ) నదీజలాలు అందించాలని నిర్ణయించారు. అప్పుడయినా కృష్ణనీళ్లు కొంచెం వదులుకుంటారేమోనన్న ఆశతో రాయలసీమ వాసులుకూడా పోలవరాన్ని ప్రోత్సహిస్తున్నారు. కానీ పోలవరం నిర్మిస్తే దేవీపట్నం, పోలవరం తాలూకాల దగ్గర మొదలుపెట్టి భద్రాచలం దాకా వందలాది కోయ, కొండరెడ్డి గూడెములు మునిగిపోతాయి. నోరులేని ఆ జీవులు వీధిపాలవుతారు. సంవత్సరంలో రెండు పంటలకూ వరిసాగుకు సరిపడా నదీజలాలు ఫ్రీగా సరఫరా అయితేనే అది వ్యవసాయం అనే అభిప్రాయాన్ని వదులుకోవడం అవసరం. మన సర్కార్ జిల్లాల మధ్యప్రాంత వాసులు ఈ అసాధ్యమయిన అభిప్రాయానికి వచ్చినట్లు అనిపిస్తుంది. ఇదే కోరిక ప్రతి ఒక్కరిలోనూ ఉంటే ఇంకొక భగీరధుడు దిగిరావలసి ఉంటుంది.

అయితే ఇది పురాణంకాదు కాబట్టి, సాగునీటి గురించి గొంతెమ్మకోరికలు తగ్గించుకొని వర్షపాతం, చెరువులు, భూగర్భజలాలు, నదీజలాలు అన్నిటినీ లెక్కలోకి తీసుకొని నీరు అనే ప్రకృతి వనరును అందరూ సమంగా పంచుకోవడానికి సిద్ధపడాలి. అందుకోసం ఇప్పుడు నదీజలాలు ఎక్కువగా వాడుకుంటున్న వాళ్లు దానిని తగ్గించుకోవడానికీ, అందుకోసం తమ పంటల విధానాన్ని మార్చుకోవడానికీ కూడా సిద్ధపడాలి.

అప్పుడే రాయలసీమకూ, దక్షిణ తెలంగాణాకు, ఉత్తర కర్నాటకలోని బిజాపూర్ వంటి వెనుకబడిన జిల్లాలకూ సాగునీటి విషయంలో న్యాయం జరుగుతుంది. నిజానికి అన్నిరకాల నీటివనరులనూ లెక్కలోకి తీసుకొని సమంగా పంచుకుంటే మన రాష్ట్రంలో ప్రతి ఎకరం. సాగు భూమికీ ఒక పంటకు నీరు ఇయ్యవచ్చునని అంచనా. నదీజలాలు పంచుకోవలసింది భాషారాష్ట్రాల ప్రాతిపదికనకాదు. నీటి అవసరానికి భాషతో ఏమీ సంబంధంలేదు. ఇతర నీటివనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతాలు, అవిలేని ప్రాంతాలు అనే ప్రాతిపదికన పంచుకోవాలి. ఈసారి (అంటే క్రీ.శ. 2000 తరువాత) కృష్ణానదీ జలాలను పంచుకొనే రోజు వచ్చినప్పుడు ఈ హేతుబద్ధమైన ప్రాతిపదికన పంపకం జరగాలనీ, దానికోసం అవసరమైన పంటమార్పిడి చేసుకోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలనీ, నదీజలాల విషయంలో ఈరోజు న్యాయాన్యాయాల గురించి మాట్లాడుతున్న వాళ్లంతా ఒప్పుకుంటారని ఆశిద్దాం. న్యాయన్యాయాల గురించి మాట్లాడుతున్నారుకాబట్టి ఈ ఆశ. దీనికోసం కృష్ణారివర్ వ్యాలీ అథారిటీ వంటి ఒక ఫెడరల్ వ్యవస్థను స్థాపించుకోగలిగితే, భారతదేశాన్ని ఒక ఫెడరల్ ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దాలని ప్రస్తుతం చాలామంది వ్యక్తం చేస్తున్న రాజకీయ ఆకాంక్షకు కూడా అది తోడ్పడుతుంది.

(వార్త దినపత్రిక సౌజన్యంతో) ☆